మూలపేటలో ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర-మునగపాక: మండలంలోని మూలపేట గ్రామంలో భువనేశ్వరి ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం ఏర్పాటు చేశారు. సుమారు 120 మంది కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు.ప్రతి ఒక్కరికి చెకప్ చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయటంతో పాటు సగం ధరకే కళ్లద్దాలు కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బీ సెట్టి గంగా అప్పలనాయుడు తో పాటు కూటమి నాయకులు ఆడారి జనార్ధన్ రావు వార్డు మెంబర్ కాండ్రేగుల వరలక్ష్మి గ్రామ పెద్దలు బొడ్డేడ ఆదికుమార్ కాండ్రేగుల ఆదినారాయణ పెంటకోట మహేష్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

చోడవరం పట్టణంలో పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్య

పట్టించుకునే నాథుడే కరువయ్యాడు

విశాలాంధ్ర-చోడవరం: చోడవరం పట్టణంలో రోజు రోజుకు ట్రాఫిక్ సమస్య పెరిగిపోతోంది. ట్రాఫిక్ సమ స్యను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు అని స్థాని కులు, గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అడపా దడపా రైడ్ లే తప్ప శాంతి భద్రతలు, ట్రాఫిక్ క్లియరెన్స్‌పై స్థానిక పోలీసు అధికారులు శ్రద్ధ చూపలేకపోతున్నారనే బహిరంగ విమర్శలు వినిపిస్తున్నాయి. కొత్తూరు జంక్షన్, చీడికాడ రోడ్డు, అన్నవరం, పెద్ద వెలమవీధి తదితర ప్రాంతాల్లో నిరంతరం ట్రాఫిక్ సమస్యలు ఏర్పడు తున్నాయి. మరోవైపు రోడ్డుకు ఇరువైపులా దురాక్రమణలు, దుకాణాలు ఎదురుగానే వాహనాలు అక్రమ పార్కింగ్ ఇలా ట్రాఫిక్ కు అనేక సమస్యలు ఎదరవుతూనే ఉన్నాయి. వీటిపై చర్యలు తీసుకోవలసిన రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ అధికారులు మొద్దునిద్ర నటిస్తుండటంతో, తరచూ ఇవే సమస్యలు ప్రజల్ని చుట్టుముడుతున్నాయి. ఏ ప్రభుత్వ శాఖ అధి కారిని అడిగినా ఏదో వంక చూపించి, తమ తప్పును ఇతర ప్రభుత్వ శాఖలకు బదిలీ చేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారు. తప్ప ప్రజలు, ట్రాఫిక్ సమస్యని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు నిత్యం పెరిగిపోతున్న ట్రాఫిక్ క్రమబద్దీకరణపై శ్రద్ధ వహించవలసిందిగా గ్రామ స్తులు, ప్రజా మహిళా సంఘాలు వారు కోరుతున్నారు.

కృష్ణా రిసార్ట్స్ ప్రారంభం

విశాలాంధ్ర-మునగపాక: మండలంలో తోటాడ సిరసపల్లి సబ్ స్టేషన్ పక్కన కొణతాల గోపికృష్ణ నూతనంగా ఏర్పాటు చేసిన కృష్ణా రిసార్ట్స్,అమరావతి ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రివర్యులు దాడి వీరభద్ర రావు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ నటులు రాజేష్,ప్రసిద్ధ వైద్య నిపుణులు డాక్టర్ ఎం.వి బెనర్జీ ,ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, వెంకటాపురం గ్రామ సర్పంచ్ సుందరపు తాతాజీ,మద్దాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని బాణసంచా తయారీ, నిల్వ, విక్రయాలపై కఠిన చర్యలు

జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: బాణసంచాను అనుమతి లేకుండా తయారు చేసినా, నిల్వ ఉంచినా, విక్రయాలు జరిపినా అటువంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్త లపై రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలు నిర్దేశించిందని, ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా సరైన భద్రతా ప్రమాణాలు పాటిస్తూ పండుగను జరుపుకోవాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. బాణసంచా విక్రయ లైసెన్స్ కల్గిన దుకాణదారులు మాత్రమే విక్రయాలు జరపాలని. మిగిలిన ఎవరు విక్రయించినా చట్ట ప్రకారం శిక్షకు అర్హులని తెలిపారు.బాణసంచా విక్రయ/ తయారీ లైసెన్స్ కల్గిన దుకాణదారులు ప్రమాదాలు నివారణ కొరకు పాటించాల్సిన నియమ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. జిల్లాలో శాశ్వత, తాత్కాలిక బాణసంచా తయారీ లేదా విక్రయాల లైసెన్సు కల్గిన దుకాణాల్లో మాత్రమే బాణసంచా అమ్మాలని అన్నారు.తాత్కాలిక లైసెన్సుదారులు బహిరంగ ప్రదేశాల్లో నిర్ణీత కొలతల మేరకు ప్రత్యేక షెడ్డులలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అగ్నిప్రమాదాలను నిలువరించేందుకు వీలుగా నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని నీరు, ఇసుక, తదితర అగ్నిమాపక సామాగ్రిని తప్పనిసరిగా టపాసుల విక్రయ దుకాణాల్లో సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

మైనర్లను బాణసంచా తయారీ, విక్రయ పనుల్లో ఉంచరాదు

లైసెన్స్ కలిగి ఉన్న విక్రయిదారులు లైసెన్స్ లేని వారికి విక్రయించి, తద్వారా ఏదైనా ప్రమాదం సంభవించినా, దానికి లైసెన్స్ దారులదే పూర్తి బాధ్యత వహించాలన్నారు. జనావాసాలకు, విద్యాసంస్థలకు, హాస్పటల్స్ కు దూరంగా బాణసంచా విక్రయాలు నిర్వహించాలన్నారు.దీపావళిని పురస్కరించుకొని బాణసంచాను అనుమతి లేకుండా నిల్వ ఉంచినా, విక్రయాలు జరిపినా, తయారుచేసినా, వాటిని వినియోగించినా, అటువంటి వారిపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయడమే కాక ప్రేలుడు పదార్థాల చట్టం, ఐపీసీ చట్టం ప్రకారం వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గతంలో ఇతర ప్రదేశాలలో జరిగిన ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని ఎటువంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా సిబ్బందిని అప్రమత్తం చేసి తనిఖీలు నిర్వహిస్తున్నామ అంతేకాకుండా ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉంటూ, పోలీసు వారి నియమ నిబంధనలను పాటించాలి. ఏమాత్రం నిబంధనలు అతిక్రమించినా, అట్టి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగు తుందన్నారు. దీపావళి పర్వదినాన్ని జిల్లా ప్రజలు అందరూ ఆనందంగా జరుపుకోవాలని, సాధ్యమైనంతవరకు కాలుష్యరహిత టపాసులనే కాల్చాలని, టపాసులు కాల్చే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పిల్లలు టపాసులు కాల్చే సమయంలో పెద్దల పర్యవేక్షణ ఉండాలని సూచించారు. దీపావళి రోజున ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినా, అత్యవసర సమయంలో ఫైర్ స్టేషన్ కు 101, పోలీస్ డయల్ 100/112 లకు లేదా స్థానిక పోలీసుల కు గాని తెలియ చెయ్యాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా బాణసంచా అక్రమ విక్రయాలు, నిల్వల సమాచారాన్ని ఉంటే పోలీసులకు తెలియచేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు.

ఫ్రీజింగ్, నిల్వ పదార్ధాలతో మహిళల్లో వేగంగా పెరుగుతున్న క్యాన్సర్ కేసులు

టాటా మెమోరియల్ హాస్పిటల్స్

విశాలాంధ్ర-చోడవరం: ఫ్రీజింగ్, నిల్వ వున్న ఆహార పదార్థాలు ఎక్కువగా వాడుతుండడంతో మహిళల్లో ఎక్కువ శాతం మంది భయంకరమైన క్యాన్సర్ బారిన పడుతున్నారని టాటా మెమోరియల్ హాస్పిటల్ వైద్యులు చెబుతున్నారు. ఫ్రీజ్‌ను త్వరగా వదిలించుకోండని హెచ్చరిస్తున్నారు. ఫ్రిజ్ ఐటమ్స్, క్యాన్సర్ మధ్య సంబంధం గూర్చి వారి మాటల్లో.... పాల నుంచి పెరుగు, వెన్న వరకు.. సాగో సోయా సాస్, పిండి, రవ్వ, ఊరగాయ. సుగంధ ద్రవ్యాలు బాదం, కూరగాయలు, ఫ్రిజ్‌లో ఏదైనా నింపండి ఇది స్త్రీల వైఖరి. ఇది మాత్రమే కాదు తిన్న తర్వాత సగం పండు మిగిలిపోయింది. నిన్న వండిన పప్పు, అన్నం, కూరగాయలు, సుగంధ ద్రవ్యాలు, అన్ని రకములైన మసాలా ప్యాకెట్లు, చల్లని పానీయాలు, స్వీట్లు, ఖరీదైన వస్తువులు మీ ఫ్రిజ్‌లో ఉన్న ఈ వస్తువులన్నీ చాలా మంచివని మీకు అపోహ ఉంది. కానీ అది క్యాన్సర్ వైరస్‌ని సృష్టిస్తోంది. మీరు 1,000 మంది వ్యక్తులపై జరిపిన అధ్యయనంలో 1,000 మందిలో 538 మంది క్యాన్సర్‌తో బాధపడుతున్నారని మీకు తెలుసా... వీరిలో ఎక్కువ మంది క్యాన్సర్ బారినపడ్డ వారు మహిళలే. మరొక ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే.. ఈ 538 మంది కూడా మహిళలే. ఫ్రిజ్‌లో భద్రపరచకుండా, మీకు వీలైనంత తెచ్చి చేయండి. సాంబార్, తాజా ఇడ్లీ, దోస, వడ మొదలైనవి, శనగపిండి, ఇతర పిండి మొదలైనవాటిలో చాలా త్వరగా కీటకాలు ప్రవేశిస్తాయని సంబంధిత నిపుణులు హెచ్చరిస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి, న్యూస్ : 33/11 కెవి యలమంచిలి సబ్ స్టేషన్ పరిధిలో 11 కెవి యలమంచిలి టౌన్ – 3 ఫీడర్ లో కొత్త 33 కెవి లైన్ వేయుట కొరకు, లైను మెయింటెనెన్స్ పనులు (చెట్లు తొలగింపు) నిమిత్తం సోమవారం నాడు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ధర్మవరం, కాకివాని వీధి, రామచంద్రమ్మ కాలనీ, కల్కి పెట్రోల్ బంక్, పెంజెరువు రోడ్, సోమలింగపాలెం ఆర్ డబ్ల్యు ఎస్ ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

సాగునీటి వనరుల అభివృద్ధిపై చర్యలు చేపట్టండి

ఏపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు

విశాలాంధ్ర-చోడవరం: ఉత్తరాంధ్రలో గల సాగునీటి ప్రాజెక్టులు అభివృద్ధి, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తి చేయడం పై తక్షణమే అభివృద్ధి చర్యలు చేపట్టాలని ఏ.పీ. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర లో 70 శాతానికి పైగా ప్రజలు వ్యవసాయం పైనే ఆధారపడి వున్నారని, రైతాంగ ప్రాంతీయ సదస్సులో తీసుకున్న నిర్ణయాలను అమలు పరచేందుకు కార్యాచరణ ప్రణాళిక ప్రారంభం అయింది అని తెలిపారు. రైతు సంఘం నేత రెడ్డిపల్లి ఆదివారం విలేఖరులతో మాట్లాడుతూ కమ్యూనిస్టు అనుబంధ సంఘాలు, వ్య.కా.సం. నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రాంతాలైన విశాఖ ఉమ్మడి జిల్లాలు, శ్రీకాకుళం, విజయనగరం తదితర జిల్లాల్లో సుమారు 25000 సాగునీటి చెరువులు కింద 23.24 లక్షలు ఎకరాలు సారవంతమైన భూములుండగా, కేవలం 8 లక్షల ఎకరాలకు ఖరీఫ్ సీజన్ లో వర్షాధారంగా మాత్రమే పంటలు పండి0చాల్సి వస్తోందని అన్నారు. ఉత్తరాంధ్ర లో ఎన్ని సాగునీటి వనరులు వున్నప్పటికీ వాటి అభివృద్ధి పై పాలకులు శ్రద్ధ చూపకపోవడంతో పంటలు ఎండిపోతున్నా యి అన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, ప్రధాన చెరువులు, గెడ్డ తదితర సాగునీటి వనరులను అభివృద్ధిచేస్తే రెండు పంట లు పండి సస్య శ్యామలం అవుతాయని తెలిపారు. అధికార కూటమి ప్రభుత్వం పెద్దలు, పాలకులు, ఇరిగేషన్ అధికారులు తక్షణమే ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులు అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏ.పి. చెరకు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేచలపు వెంకటరమణ (కాసుబాబు), మండల రైతు సంఘం కార్యదర్శి రొంగలి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు నీళ్లొదులుతోన్న మందుగుండు వ్యాపారులు!

చోద్యం చూస్తున్న అధికారులు...

విశాలాంధ్ర-చోడవరం : చోడవరం తో సహా చుట్టుపక్కల గ్రామాల్లో ప్రభుత్వ నిభందనలకు నీళ్ళొదిలి మందుగుండు సామాగ్రి విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మొద్దు నిద్ర నటిస్తూ చోద్యం చూస్తున్నారు అనే ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. దీపావళి కి టపాసులు, క్రాకర్స్ కాల్చటం పిల్లలు, పెద్దలు ఆనందం, సాంప్రదాయం. ఈ సంప్రదాయాన్ని చాలా మంది వ్యాపారస్తులు అలుసుగా తీసుకొని పదుల్లో ఖరీదు చేసే మందుగుండు సామాగ్రి కి వేలల్లో వసూళ్లు చేస్తూ దర్జా చేస్తున్నారు. తిలా దానం తలా పిడికెడు అన్న చందంగా మందు .. గుండు, లంచాలు, ఇతర లాంచనాలతో అధికారులను ప్రసన్నం చేసుకుంటున్నారు. దీనిపై ఫిర్యాదు చేస్తే, ఫిర్యాది దారు పై చర్యలే తప్ప, తప్పు చేస్తున్న వ్యక్తులను అక్రమ వ్యాపారాన్ని అరికట్టలేకపోతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా చాలా మంది జనసమూహాలు మధ్య, బహిరంగ ప్రదేశాల్లో నే కాకుండా ఇళ్ళల్లో కూడా మందుగుండు సామాగ్రిని విక్రయిస్తున్నారు. నిబంధనలు ను పూర్తిగా గాలికి వదిలేస్తున్నారు. ప్రమాదాలు జరిగితే నష్టాలు కూడా భారీగా జరగడం మనం దీపావళి మరుసటి రోజు మనం పేపర్లలో చదువుతున్నాం. ముందుగా మందుగుండు విక్రయదారులు పలు జాగ్రత్తలు తీసుకొని, నిబంధనలు పాటిస్తే ఇలాంటి ప్రమాదాలను నివారించవచ్చు అని పలువురు ప్రముఖులు సూచన. ఐతే దీనికి సంబంధించి ఎన్నో ప్రభుత్వ దాఖలు, అధికారులు ఉన్నప్పటికీ నిబంధనలను మాత్రం పూర్తి స్థాయిలో అమలు చేయించలేకపోతున్నారు అని ప్రజా, మహిళా సంఘాలు ఆరోపిస్తున్నాయి. మందుగుండు సామాగ్రి దుకాణాలు పై ప్రభుత్వ నిబంధనలను అమలు చేయటం లో విఫలం అవుతున్నారో లేక అధికారులు మందుగుండు సామాగ్రి వ్యాపారస్తులను ప్రోత్సహిస్తున్నారో... అర్థం కావడంలేదని ప్రజల్లో అనుమానాలు కలుగుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలు నివారించాలని, ప్రభుత్వ ఆదేశాలకు తగిన గౌరవం ఇవ్వాలని కార్మిక, కర్షక, ప్రజా, మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

మళ్లీ బుసలు కొడుతున్న గ్రావెల్ మాఫీయా

పెదముషిడివాడలో ప్రారంభమైన గ్రావెల్ అక్రమ తవ్వకాలు

రాత్రివేళల్లో దర్జాగా తరలింపు

పట్టించుకోని రెవెన్యూ, ఇరిగేషన్, మైన్స్, పోలీస్ అధికారులు

విశాలాంధ్ర-పరవాడ: పరవాడ మండలం పెదముషిడివాడలో గ్రావెల్ మాఫీయా మళ్ళీ బుసలు కొడుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లు రెచ్చిపోయిన గ్రావెల్ దొంగలు అడ్డు అదుపు లేకుండా అక్రమ దందాను కొనసాగించారు. అధికారం ఉందన్న బరితెగింపుతో కొట్లాది రూపాయల ప్రభుత్వ సంపదను దోచుకున్నారు. ఈ గ్రావెల్ దోపిడీపై ఆయా శాఖాధికారులకు ఎన్ని ఫిర్యాదులు ఇచ్చినా చర్యలు తీసుకునే వారు కాదు. అప్పటి ఎమ్మెల్యే అండదండలు పుష్కలంగా ఉండటంతో గ్రావెల్ ను అక్రమంగా తరలించి కోట్లు కొల్లగొట్టారు. ఓ పక్క సర్వే నెంబర్ 323 ఎర్ర చెరువు, 298 బచ్చల బందలోను, మరో పక్క ల్యాండ్ పూలింగ్ సర్వే నెంబర్ 367లోను, 365 బంజరులోను గ్రావెల్ తరలించారు. 407, 409 సర్వే నెంబర్లలోని కొండలను గుల్ల చేసారు. పగటి వేళ అడపా దడపా జరిగే గ్రావెల్ తవ్వకాలు రాత్రి వేళల్లో మాత్రం జోరందుకునేవి. జీసీబీలతో తవ్వి బెంజిలు, క్వారీ కారీలతో గ్రావెల్ మట్టిని తరలించి సొమ్ము చేసుకున్నారు. బహిరంగంగానే జరిగినప్పటికీ రెవెన్యూ, మైనింగ్, ఇరిగేషన్, పోలీస్ అధికారులెవరూ పట్టించుకునేవారు కాదు. మంత్లీల మాయలో పట్టించుకోలేదన్న విమర్శలు కూడా అప్పట్లో ఉండేవి. ఇదే క్రమంలో జగనన్న అర్బన్ హౌసింగ్ లేవుట్లో కూడా సిమెంట్, కంకర, ఇసుక తదితర సామాగ్రినీ కూడా గుట్టు చప్పుడు కాకుండా ఈ గ్రావెల్ మాఫీయానే దోచుకునేవారు. అధికారులు కూడా అప్పటి ఎమ్మెల్యే ఒత్తిడి ఎక్కువగా ఉండేదని తప్పించుకునేవారు. అయితే ఇటీవల కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో అప్పటి గ్రావెల్ మాఫియా వెనకడుగు వేసింది. కొన్నాళ్లుగా సైలెంట్గా ఉంటూ వచ్చారు. అప్పు దప్పుడూ అడపా దడపా దొంగచాటుగా వ్యవ హరించిన గ్రావెల్ దొంగలు వారం రోజులుగా ఉన్నట్టుండి మళ్లీ బుసలు కొడు తున్నారు. అర్ధరాత్రి 12 నుంచి తెల్లవారు 5 గంటల వరకు అక్రమంగా గ్రావెల్ తవ్వి తరలి స్తున్నారు. కూటమి నాయకులతో ఏం ఒప్పందం కుదిరిందో తెలియదు కానీ గత గురువారం, శుక్రవారం ల్యాండ్ పూలింగ్ ప్రాంతంలో జోరుగా సాగాయి. గ్రావెల్ తవ్వి అక్రమంగా తరలించారు. ఈ గ్రావెల్ ఇటు ల్యాండ్ పూలింగ్ నుంచి మార్కండేయ నగర్ కాలనీ మీదుగా లంకెలపాలెం ప్రాంతానికి వెళ్తోంది. అయినప్పటికీ అక్కడ గస్తీలో ఉన్న పోలీసులు కూడా ఆ గ్రావెల్ లారీలను ఆపిన పరిస్థితులు కనిపించలేదు. ఇప్పటికైనా రెవెన్యూ, ఇరిగేషన్, మైన్స్, పోలీస్ అధికారులు స్పందించి పెదముషిడివాడలో జరుగుతున్న గ్రావెల్ దోపిడీని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పరిశ్రమల పేరుతో వ్యవసాయానికి యోగ్యమైన భూములను నాశనం చేయద్దు!

ఎస్ఈజెడ్ లకు భూకేటాయింపులను వ్యతిరేఖించండి : వామపక్షాలు

విశాలాంధ్ర-కె కోటపాడు: వ్యవసాయానికి యోగ్యమైన భూములు రైతులు నుండి తీసు కోవద్దని,ఎస్ ఈ జెడ్ లకు భూ కేటాంపులను రైతులు వ్యతిరేఖించాలని వామపక్షాలు పిలుపునిస్తున్నాయి. చెరకు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేచలపు కాసుబాబు , సిపిఐ మండల కార్యదర్శి గొర్లె దేముడు బాబు , సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న మండల కార్యదర్శి రోంగలి ముత్యాలు నాయుడు లు ఈ మండలం ఆర్లి, చింతపాలెం గరుగుబిల్లి ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఎస్ ఈ జెడ్ నిర్మాణానికి కావలసిన 1012,ఎకరాలు,భూమి,ఆర్లి,చింతపాలెం గరుగుబిల్లి రెవిన్యూ పరిధిలో ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించి ఎస్ ఈ జెడ్ లకు కేటాయింపులకు ప్రయత్నం చేస్తుందని తెలిపారు, 602 మంది రైతుల నుండి 700 ఎకరాలు డిఫారం మెట్టు భూములు, అలాగే విశాఖ స్టీల్ ప్లాంట్ (గ్రీన్ బెల్ట్) కు మొక్కల పెంపకం కోసం కేటాయించిన 300 ఎకరాలు,మొత్తం కలిపి 1000 ఎకరాలు పైగా ఎస్ ఈ జడ్ కోసం కేటాయించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తుందని తెలిపారు. ఎస్ ఈ జడ్ లకు స్థలం కేటా యింపులు ఏ జోన్ క్రిందకు వస్తాయో ముందుగా స్పష్టం చేయాలని డిమాండ్ చేసారు, రెడ్,అరెంజ్, గ్రీన్, ఎజోన్ క్రిందకు వస్తాయో స్పష్టం చేయకుండా భూములు కేటాయింపు చేయరాదని కోరారు,ఇప్పటికే అచ్చుతాపురం ఎరియాలో 12,500, పరవాడ ప్రాంతంలో ని 2,500 ఎకారాలు భూములు ఎస్ ఈ జడ్ లకు కేటాయింపులు జరిగాయని అక్కడ పూర్తి స్థాయిలో కంపెనీలు నిర్మాణం జరగలేదన్నారు. కోద్దిపాటి భూముల్లో ,నిర్మాణం జరిగిన కంపినిలు కూడా విదేశాల్లో నిషేదించిన కంపెనీలను ప్రమాద కరమైన కంపెనీ లను అక్కడకు తీసుకు వచ్చి నిర్మాణాలు చేసారని తెలిపారు, దీనివల్ల అప్రాంతం లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు . ఈ కంపెనీ లు ద్వారా వచ్చే వ్యర్థాలను అక్కడ సముద్రం లోకే వదలి పెడుతున్నారని మరి ఇక్కడ అదే ప్రమాద కరమైన కంపెనీలు తీసుకోస్తే వ్యర్థాలను ఎక్కడ కు పంపిస్తారో స్పష్టం చేయాలని డిమాండ్ చేసారు . కోటపాడు దేవరాపల్లి చీడికాడ మాడుగుల రావికమతం రోలుగుంట నర్సీపట్నం వరకు ప్రజలు సెఫ్ జోన్ లో పోల్యూషన్ ప్రబావం లేకుండా ప్రసాంతంగా బ్రతుకు తున్నారని ఇప్పుడు యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని నమ్మించి విషం చిమ్మే కంపినిలు తీసుకు వచ్చి ప్రజలు ప్రాణాలను పచ్చటి పంట పోలాలను నాశనం చేయడం కోసం ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు, భూములు కేటాయింపు జరగిన ప్పుడే ఏ కంపినీలు పెడతారో ముందుగా రైతులకు తెలియ జేయాలని కోరారు . భూసేకరణకు రైతుల నుండి అనుమతి పొంది,వారి భూమితో పాటు వారి భూమిలోని చెట్లకు కూడా నష్ట పరిహారం అందించిన తర్వాతే భూమిని ఎస్ ఈ జెడ్ కోసం కేటాయింపు చేస్తామని స్థానిక ఎమ్మెల్యే తెనెపూసినకత్తిలాంటి తియ్యని మాటలు చేబున్నారని , ఎక్కడ భూసేకరణ జరిగిన 2013 భూసేకరణ చట్ట ప్రకారం అక్కడ అమలవుతుందని కోత్తగా చేప్పనఅవసరం లేదన్నారు . అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్, తాను ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను నెర వేర్చేందుకు కృత నిశ్చయంతో ఉన్నట్లు ఎమ్మెల్యే బండారు చేబుతున్నారని , మరి జిల్లాలోని మూత పడ్డ షుగర్ ప్యాక్టరిలు తెరి పిస్తామని గోవాడ షుగర్ ప్యాక్టరిని ఆదునిక రిస్తా మని సిఎం రమేష్ మాట ఇచ్చారని మరి అవి ఎందుకు నేరవేర్చడం లేదని ప్రశ్నించారు?, ఉన్న కంపెనీలు తెరి పించలేని పార్లమెంటు సభ్యులు సిఎం రమేష్ ఎస్ ఈ జడ్ పేరుతో ప్రజలు జీవితాలను నాశనం చేసె ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు, ఇది నమ్మి రైతులు మోస పోవద్దని అన్నారు. జిల్లాలోని మాడుగుల నియోజకవర్గంలో అత్యధిక రిజర్వేయర్లు ఉన్నాయని అత్యదిక భూములు వ్వసాయానికి యోగ్యమైన భూములని అభూముల్లో పరిశ్రమలు పెట్టి కన్నా వ్యవసాయానికి అనుభంద మైన వాటిని ఎలా అబివృద్ది చేయాలో అటువంటి వాటిని అబివృద్ది చేయాలని కోరారు, ఇప్పటికే పరవాడ అచ్చుతాపురం ఎరియా సెజ్జల్ వలన జరిగే ప్రమాదాలు మోసాలు స్థానికులకు ఉపాధి ఇవ్వకుండా ఎలామోసం చేస్తున్నారో చూస్తున్నామని తెలిపారు, ఇక్కడ కూడా అదే పరిస్థితి ఎర్పడు తుందని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు విటిని అనుమతి ఇంచ కూడదన ప్రజలకు విజ్ఞప్తి చేసారు